సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



16 వాహనాలు..

సంచార పశు వైద్యశాలలు అమూల్య సేవలు అందిస్తున్నాయి. 24981 ట్రిప్పులు వేశాయి.

- 8లో



పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీనిపై అధికారులు సమీక్షించారు.

- 8లో



కొత్తూరులో భారీ వర్షం

కొత్తూరు: కొత్తూరులో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు గంట పాటు ఉరుములు మెరుపులతో కురిసిన వర్షంతో ప్రజలు భయాందోళన చెందారు. హడ్డుబంగి గెడ్డ, ఎదుర్లుగెడ్డలతో పాటు పలు గెడ్డలు పొంగిపొర్లాయి.

న్యూస్‌రీల్

ముగిసిన పంచాయతీ కార్యదర్శుల శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: స్థానిక జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో ఆరు రోజుల పాటు నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల శిక్షణ ఆదివారం ముగిసింది. జిల్లాలోని మొత్తం గ్రామ కార్యదర్శులకు నాలుగు విడతల్లో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ శిక్షణ నిర్వహించింది. శిక్షణలో పంచాయతీ రాజ్ చట్టాలు, పాలన, గ్రామ స్థాయిలో లేఅవుట్ల అనుమతులు అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు రోజు కార్యదర్శులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీటీసీపీఓ కిశోర్‌కుమార్, డీపీఆర్సీ డీపీఎం లోక్‌నాథ్, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

ఉల్లాసంగా రగ్బీ జిల్లా జట్ల ఎంపికలు



ఎంపికైన రగ్బీ జిల్లా జట్లు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం రగ్బీ జిల్లా జట్ల ఎంపికలు ఉల్లాసంగా జరిగాయి. అండర్–18 విభాగంలో బాల బాలికలకు నిర్వహించిన ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ప్రారంభించారు. ఒక్కో టీమ్ నుంచి 12 మంది చొప్పున 24 మందిని ఎంపిక చేశారు. వీరంతా అక్టోబర్ నెలలో కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.గోవిందరాజు, ప్రతినిధులు పి.పార్వతీశం, డి.రామకృష్ణ, బి.నారాయణరావు తెలిపారు. పీడీలు కేకే రామిరెడ్డి, జి.శ్రీనివాసరావు, ఎన్.రమేష్, రాజా, కె.రఘునాథరావు, నీలకంఠేశ్వర్రావు, ఎస్.శైలజ, శ్యామలరావు తదితరులు ఎంపికలను పర్యవేక్షించారు.

ఐకమత్యంతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న గుమ్మా నగేష్

ఆమదాలవలస: బ్రాహ్మణులంతా ఐకమత్యంతో మెలిగితేనే హక్కులు సాధించవచ్చునని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గుమ్మా నగేష్ అన్నారు. ఆమదాలవలస మాజీ ఎమ్మెల్యే కేఎస్ భుక్త అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల బ్రాహ్మణ సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో బ్రాహ్మణ కుటుంబాలు ఎలాంటి సాయం చేసేందుకైనా జిల్లా సంఘం అందుబాటులో ఉంటుందన్నారు. ఐక్యత లేకపోతే సమస్యల పరిష్కారం సాధ్యం కాదన్నారు. ఆమదాలవలస బ్రాహ్మణ సంఘంలో కొన్ని ఇబ్బందులు తమ దృష్టికి తీసుకువచ్చారని, అవి పరిష్కరించి బ్రాహ్మణులంతా ఒకే తాటిపై నడిచే విధంగా చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో వేద పండితులు భాస్కరభట్ల శ్రీరామమూర్తి, మండల కన్వీనర్ బీవీ రమణమూర్తి, బలివాడ చిట్టిపంతులు, ఎస్.వి.రమణ, శేషగిరిశాస్త్రి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

'విద్యార్థుల్లో సేవా దృక్పథం అవసరం'

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో సేవా దృక్పథం అవసరమని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. ఎస్ఎంపురం క్యాంపస్‌లో ఆదివారం జాతీయ సేవాపథకం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ట్రిపుల్ ఐటీలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజ ప్రయోజక కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్ బాబు, పారిపా లన అధికారి ముని రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.ముకుందరావు, పీఓలు డాక్టర్ వి.సింహాచలం, డాక్టర్ బి.శ్రీధర్, డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి'

పలాస/కాశీబుగ్గ: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఫార్మసిస్టులు డాక్టర్లతో కలిపి కృషి చేస్తున్నారని ఫార్మసిస్టు సంఘ జిల్లా నాయకులు బోనేల గోపాల్ అన్నారు. ఆయన ఆదివారం పలాసలో విలేకరులతో మాట్లాడారు. డ్రగ్ డిస్పెన్సింగ్, వ్యాక్సినేషన్, కమ్యూనికేబుల్, నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్, కుటుంబ నియంత్రణ వివిధ రకాల శాఖల్లో అమూల్యమైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. కోవిడ్ వంటి ఆపత్కాలంలో ఫార్మసిస్టులు చేసిన సేవ నిరుపమానమని అన్నారు.

కళల కలబోత



ఖరీదైన చీరను నేస్తున్న కార్మికులు

- చేనేత వస్త్ర విపణిలోకి సరికొత్త చీరలు
- విదేశాలకు ఎగుమతి అవుతున్న పొందూరు పేపర్ వర్క్ చీరలు
- ఆన్‌లైన్‌లోనూ విక్రయాలు

పొందూరు: పేపర్ వర్క్ చీరలు.. పేరు కొత్తగా ఉంది కదా. చేనేత వస్త్ర విపణిలోకి దూసుకు వచ్చిన ఈ చీరలు ఇప్పుడు హవా చూపిస్తున్నాయి. అసాధారణ రీతిలో పొందూరు చేనేత కళాకారులు తయారు చేస్తున్న ఈ చీరలు విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయి. కాసింత ప్రచారం ఉంటే స్థానికంగా కూడా చీరలు ఇంకా ఆకట్టుకుంటాయని పొందూరు నేతన్నలు చెబుతున్నారు. వీటి ధరలు ప్రస్తుతానికి రూ.30వేల నుంచి రూ.2లక్షల వరకు పలుకుతున్నాయి. పదేళ్లుగా వీటిని తయారు చేస్తున్నా ఇప్పుడు మాత్రం బాగా గిరాకీ నెలకొంది.



నాలుగు నెలల కాలం..

ఈ చీరల ధర డిజైన్ బట్టి ఉంటుంది. పైట అంచు డిజైన్ మాత్రమే ఉంటే ఒక ధర, చిన్న డిజైన్ చీరంతా ఉంటే ఎక్కువ ధర పలుకుతున్నాయి. పొందూరు ప్రాంతంలో గోరు సురేష్–లక్ష్మి, అంకం పైడిసూర్యం– భారతి, చల్ల బసవరాజు–కుమారి, అంకం వీర్రాజు–రమణమ్మ దంపతులు, యర్రా నందీశ్వరరావు, కాలెపు రమణ తదితరులు ఈ చీరలను నేస్తున్నారు. ఒక చీర నేసేందుకు నెలకు రూ. 8వేల నుంచి రూ. 9వేలు వరకు మజూరీ పొందుతున్నారు. అయితే ఆ చీర నేసేందుకు సుమారు నెల రోజుల నుంచి నాలుగు నెలలు పడుతుంది. అంటే ఒక చీర నేసేందుకు రూ. 32వేల నుంచి రూ. 36వేలు మజూరీ అందుతుంది. ఆ చీరను మాస్టర్ వీవర్ రూ. లక్ష నుంచి రూ. 2 లక్షలు వరకు అమ్ముకుంటున్నారు. కుటుంబ సభ్యులంతా చీర నేసేందుకు సహకరించాల్సి ఉంటుందని నేత కార్మికులు చెబుతున్నారు. ఒక్కో చీర పొడవు రవికతో కలుపుకొని 7 మీటర్లు ఉంటుంది. ఈ చీరలకు అంచులు మూడు నుంచి 12 ఇంచీల వరకు ఉంటుంది. మాస్టర్ వీవర్ యార్న్, డిజైన్, రంగుల దారాలు, స్వచ్ఛమైన కాటన్ దారాలు, వెండి దారాలు, ప్రత్యేకమైన సిల్వర్ జరీ దారాలు ఇచ్చి చీరలను నేయిస్తున్నారు. ఊదా, పసుపు, రాణీరంగు, ఆకుపచ్చ, లేత ఆకుపచ్చ రంగుల్లో చీరలు ఉంటాయి. ఈ చీరలపై నెమళ్లు, రామ చిలుకలు, పూలు, సీతాకోక చిలుకలు ఇలా తదితర డిజైన్లు కూడా వేస్తున్నారు.

ఈ మాస్టర్ వీవర్లు ఇచ్చే మజూరీలు సాధారణంగా చేనేత కార్మికులకు సొసైటీలు ఇచ్చే కంటే ఎక్కువ ఉంది. కానీ మాస్టర్ వీవర్లు మాత్రం చాలా పెద్ద మొత్తంలో లాభాలు ఆర్జిస్తారు. ఇలాంటి చీరలు నేసేందుకు సొసైటీలు, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందటం లేదని కొందరు చెబుతున్నారు. ఈ చీరలు నేసే నేత కార్మికులపై సొసైటీలు, ప్రభుత్వం దృష్టి సారిస్తే మరింత మందికి మెరుగైన ఉపాధిని కల్పించవచ్చని అంటున్నారు.

బ్రాండ్‌లను మరిపించేలా..



సిల్వర్ జరీతో చీర నమూనా

పొందూరు సమీపంలో పొందూరు, తండ్యాం మెట్ట (ఎస్ఆర్ఎన్ కాలనీ)తో పాటు మిగిలిన ప్రాంతాలైన కరిమిలిపేట, అలికాం, వేణమ్మపేట, దేవర వలస, పాతకుంకాం, పెనుబాక, బొద్దాం, అక్కులపేట, మామిడిపల్లి తదితర ప్రాంతాల్లో ఈ తరహా చీరలను నేస్తున్నారు. ఈ చీరలు గద్వాల్, బెనారస్, పోచంపల్లి చీరలను మరిపించే విధంగా ఉంటున్నాయి. హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, న్యూఢిల్లీతో పాటు చైనా, పారిస్ తదితర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో చేనేత రంగంలో నిపుణులైన కార్మికులు ఉండటంతో విదేశీ ఆర్డర్లు వస్తున్నాయి. మాస్టర్ వీవర్లకు వస్తున్న ఆర్డర్లు మేరకు చేనేత కార్మికులు మంచి డిజైన్లతో చీరలు నేస్తున్నారు.

చేనేత సొసైటీలో సభ్యత్వం లేదు



పొందూరు సాయి బాబు వీవర్స్‌కు చేనేత సొసైటీలో సభ్యత్వం లేదు. మాస్టర్ వీవర్స్ పని కల్పిస్తున్నారు. ప్రస్తుతం చీరలకు పైట అంచులు డిజైన్లను నేస్తున్నాం. పేపర్ వర్క్ చీరలను నేయడం వల్ల మాకు మంచి ఆదాయం వస్తుంది. మజూరీలు ఎప్పటికప్పుడు అందజేస్తున్నారు. చేనేత కార్మికులు ప్రత్యామ్నాయ వృత్తులోకి వెళ్లకుండా మాస్టర్ వీవర్లు ఆదుకుంటున్నారు.

– గోరు సురేష్–లక్ష్మి దంపతులు, ఎస్ఆర్ఎన్ కాలనీ, తండ్యాం మెట్ట

ఆప్కో దృష్టి పెట్టాలి



ఈ తరహా చీరలను నేసేందుకు కార్మికులను ఆప్కో ప్రోత్సహించాలి. ఆ మేరకు హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ శాఖ తగు చర్యలు తీసుకోవాలి. దీనివల్ల ఆప్కో లాభాలు రావడమే కాకుండా కార్మికులకు మంచి ఆదాయం చేకూరుతుంది. చేనేత కార్మికులకు ఆర్థిక పరమైన తోడ్పాటు అందించవచ్చు. మాస్టర్ వీవర్స్ ఇచ్చే మజూరీ కంటే ఎక్కువ అందించవచ్చు.

– చందన అసిరిబాబు, అధ్యక్షుడు, సాయిబాబా చేనేత సొసైటీ, పొందూరు

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీకాకుళం పాగా

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారులు పాగా వేశారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడామైదానం వేదికగా ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2023 పోటీలు జరిగాయి. ఈ పోటీలకు శ్రీకాకుళం జిల్లా నుంచి వివిధ వయో విభాగాల్లో మొత్తం 95 మంది క్రీడాకారులు హాజరుకాగా.. 43 పతకాలతో సత్తాచాటారు. ఇందులో బంగారు పతకాలు 11, రజతాలు 10, కాంస్య పతకాలు 22 ఉన్నాయి. బంగారు పతకాలు సాధించిన అథ్లెట్స్ జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా అథ్లెట్స్ పతకాలు సాధించడంపై శ్రీకాకుళం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు (వాసు), ముఖ్య సలహాదారు నౌపడ విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ముఖ్య సలహాదారు పి.సుందరరావు, డీఎస్ఏ చీఫ్ కోచ్ కె.శ్రీధర్‌రావు, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, కె.మాధవరావు, కె.హరిబాబు, పీడీలు, పీఈటీలు హర్షం వ్యక్తం చేశారు.

స్కూల్‌గేమ్స్ పోరుకు సై



ఖోఖో సాధనలో బాలురు

- నేటి నుంచి జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు
- ఐదు రోజులపాటు మొత్తం 28 క్రీడాంశాల్లో ఆటలు


శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల క్రీడల (స్కూల్ గేమ్స్) పోటీలకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ పరిధిలోని పాఠశాల క్రీడల సమాఖ్య (స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 30వ తేదీ (ఒక రోజు రిజర్వ్‌గా ఉంచారు) వరకు జరగనున్న జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అండర్–14, అండర్–17 వయో విభాగాల్లో జిల్లాలో అత్యంత ఆదరణ కలిగిన 9 క్రీడాంశాల్లో తొలుత మండల, ఆ తర్వాత నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించిన విషయం తెలిసిందే. జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు 8వేల మంది వరకు బాలబాలికలు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

28 క్రీడాంశాల్లో జిల్లాస్థాయి ఎంపికలు..

వాస్తవానికి జిల్లా స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు మొత్తం 32 క్రీడాంశాల్లో నిర్వహించాల్సి ఉంది. అయితే రాష్ట్రపోటీల షెడ్యూల్ సమీపించిన నేపథ్యంలో రెజ్లింగ్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, హాకీ నాలుగు క్రీడాంశాల్లో ఇప్పటికే ఎంపికలను పూర్తిచేశారు. దీంతో మిగిలిన 28 క్రీడాంశాల్లో జిల్లాస్థాయి పోటీల నిర్వహణకు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారు.



సాఫ్ట్‌బాల్ శిక్షణలో క్రీడాకారులు



ముస్తాబైన మైదానాలు..

జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్–14, అండర్–17 బాలబాలికల ఎంపిక పోటీలకు ఆతిథ్యమిస్తున్న శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానం, కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. ఈ నెల 28వ తేదీన టెక్కలి వేదికగా వెయిట్‌లిఫ్టింగ్, రగ్బీ, నెట్‌బాల్, రోప్ స్కిప్పింగ్, సాఫ్ట్ టెన్నిస్ క్రీడాంశాల్లో ఎంపికలను నిర్వహిస్తున్నారు. డీఈఓ కె.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి నేతృత్వంలో సీనియర్ పీడీలతో కూడిన సెలెక్షన్ కమిటీలను నియమించారు.

పోటీలకు హాజరయ్యే బాలబాలికలకు జగనన్న గోరుముద్ద పేరిట నాణ్యమైన మెనూతో మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

పోటీల షెడ్యూల్

శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్, కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా..

- 25న జరిగే క్రీడాంశాలు: కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్(అండర్–14 మాత్రమే), ఫుట్‌బాల్, లాన్‌టెన్నిస్, ఆర్చరీ(ఆదిత్య అకాడమీ) శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఎంపికలు జరుగుతాయి.
- 26న : బాల్ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, షటిల్ బాడ్మింటన్ (అండర్–17 మాత్రమే), టేబుల్‌టెన్నిస్ (శ్రీకాకుళం న్యూ సెంట్రల్ స్కూల్‌లో), సాఫ్ట్‌బాల్, తైక్వాండో (శ్రీకాకుళం టౌన్‌హాల్), ఫెన్సింగ్ (శ్రీకాకుళం టౌన్‌హాల్)
- 27 : జూడో, బేస్‌బాల్, చెస్, బాక్సింగ్, త్రోబాల్, యోగా, టెన్నికాయిట్, బాస్కెట్‌బాల్(శ్రీకాకుళం ఎన్టీఆర్ ఎంహెచ్ స్కూల్), సెపక్‌తక్ర (శ్రీకాకుళం ఎన్టీఆర్ ఎంహెచ్‌స్కూల్)
- 29న: అథ్లెటిక్స్, క్రికెట్.

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వేదికగా

- 28న : వెయిట్‌లిఫ్టింగ్, రగ్బీ, నెట్‌బాల్, రోప్‌స్కిప్పింగ్, సాఫ్ట్ టెన్నిస్



శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ అధికారుల పర్యవేక్షణలో ఖోఖో కోర్టులను సిద్ధం చేస్తున్న పీడీలు

ఏర్పాట్లు పూర్తి చేశాం



ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్కూల్‌గేమ్స్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పోటీలకు హాజరయ్యే బాలబాలికలు తగిన ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలి. కలెక్టర్ సూచనలు, డీఈఓ ఆదేశాల మేరకు క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. డీఈఓ నేతృత్వంలో పీఈటీ సంఘ నాయకులు, పీడీల సహకారంతో పోటీలను విజయవంతం చేస్తాం.

– బీవీ రమణ, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి

విజయవంతం చేయాలి..



విద్యాశాఖ పరిధిలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే జిల్లాస్థాయి ఎంపిక పోటీలను విజయవంతం చేయాలి. సీనియర్ పీడీల సమక్షంలో సెలెక్షన్ కమిటీ ద్వారా పారదర్శకంగా ఎంపికలను చేపట్టేలా ఆదేశాలు ఇచ్చాం. అన్ని పాఠశాలలు నిర్దేశిత స్కూల్‌గేమ్స్ ఫీజులను చెల్లించి సహకరించాలి. పోటీలకు హాజరయ్యే బాలబాలికలకు జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన భోజన ఏర్పాట్లు చేస్తున్నాం.

– కె.వెంకటేశ్వరరావు, డీఈఓ, శ్రీకాకుళం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు

కుసుమ గణపతి



జిల్లా కేంద్రంలోని పాలకొండ రోడ్డులో కొలువై ఉన్న విజయ గణపతికి ఆదివారం పుష్పయాగం నిర్వహించారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్‌కుమార్ శర్మల ఆధ్వర్యంలో బంతులు, చామంతులు, గులాబీలు, విరజాజి, సన్నజాజి, కనకాంబరాలు, కలువలు, పారిజాతాలను స్వామికి సమర్పించారు.

– శ్రీకాకుళం కల్చరల్

పోటెత్తిన భక్తజనం



సూర్యనమస్కార పూజలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. అంతరాలయంలో స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే భక్తులకు ఉచిత మంచినీరు, ఉచిత వైద్య సదుపాయాలతో పాటు ఉచిత ప్రసాదాలను కూడా ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కొత్తగా రూ.300తో ఆలయ మండపాల్లోని సూర్యనమస్కార పూజలకు ఎగ్జిట్ ద్వారం నుంచి ప్రత్యేకంగా అనుమతివ్వడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు కుటుంబసమేతంగా ఆదివారం ఉదయం ఆదిత్యుడిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లా సమగ్రశిక్ష జీసీడీఓ కర్రి రోజారమణి కుటుంబ సమేతంగా ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఇక ఆదివారం నాడు దర్శనాల టిక్కెట్ల రూపంలో రూ.1,13,100, విరాళాలు ఆర్జిత సేవల రూపంలో రూ.62,621, ప్రసాదాల విక్రయాలతో రూ.1.50 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈఓ తెలిపారు.

అదిరేటి స్టెప్పు మేమేస్తే..



మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తాను నివాసం ఉంటున్న పలాస జీఎంఆ కాలనీలో స్థానికులతో కలిపి వినాయక నిమజ్జనంలో సరదాగా కాలు కదిపారు. సతీమణి శ్రీదేవితో కలిసి స్వామి ఊరేగింపులో పాల్గొని స్టెప్పులు వేశారు.

– కాశీబుగ్గ

తగ్గిన వరద నీటి ఉద్ధృతి



మహేంద్ర తనయలో ప్రవాహ ఉద్ధృతి తగ్గుతోంది. ఇటీవల ఒడిశాలో కురిసిన వర్షాలకు భారీగా వరద నీరు నదిలోకి వచ్చి చేరింది. పాతపట్నం నీలకంఠేశ్వర ఆలయం వద్ద ఉన్న కాజ్‌వేకు తగులుతూ పారింది. ఇప్పుడు వరద తగ్గడంతో కాపు గోపాలపురం, హరిజన గోపాలపురం రెండు గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

– పాతపట్నం

క్లుప్తంగా

'విద్యా విధానంలో మార్పులు గమనించాలి'



మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్జీయూకేటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుత విద్యా విధానం అమలులో అనేక మార్పులు వస్తున్నాయని, ఈ మార్పులు గమనించి విద్యార్థులను ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ ఎస్‌ఎం పురం క్యాంపస్‌లో ఆదివారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ఓరియంటేషన్ ప్రొగ్రాం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. నూతన విద్యా విధానం అమలు తర్వాత ఇంజినీరింగ్ విద్యలో అనేక మార్పులు వచ్చాయని అన్నారు. థియరీ, ప్రాక్టికల్స్, ఇంటర్న్‌షిప్‌లు పక్కాగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థులు రిలీవ్ నాటికి మంచి ప్యాకేజీలతో ఉద్యోగం సాధిస్తున్నారని అన్నారు. మరో పక్క ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో సైతం సత్తా చాటుతున్నారని పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీ గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రతిభ గల విద్యార్థులు చేరుతున్నారని అన్నారు. వారిలో నైపుణ్యాలు వెలికి తీసి ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని అన్నారు. అనంతరం వర్సిటీలో నిర్మాణాలు, అకడమిక్ వ్యవహారాలు, వసతి గృహం నిర్వహణ వంటివాటిపై సమీక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ మోహన కృష్ణ, రిసోర్సు పర్సన్లు ప్రొఫెసర్ డి. హరినారాయణ, ప్రొఫెసర్ భాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్ రామకృష్ణారావు పాల్గొన్నారు.

'పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి'



ఆర్మీలో కుమారులను కోల్పోయిన మాతృమూర్తులతో మాట్లాడుతున్న రాకేష్

కాశీబుగ్గ: పలాస పరిసర ప్రాంతంలో సీబీఎస్‌ఈ సిలబస్‌తో కూడుకున్న కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని హెడ్ క్వార్టర్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సబ్ ఏరియా ఆర్మీ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ రాకేష్ మనోచ అన్నారు. ఆయన ఆదివారం పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ చినబడాంలో ఉన్న ఆర్మీ క్యాంటీన్ సందర్శించారు. అనంతరం మాజీ సైనికులు, వీర మహిళలు, వీర మాతృమూర్తులతో సమావేశమయ్యారు. పలాసలో ఆర్మీ కుటుంబాల పిల్లల కోసం కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరుగుతుందని కొందరు ప్రతిపాదించారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఆర్మీ ఉన్నత అధికారులకు సమాచారం చేరవేసి పూర్తి అనుమతులు పొంది ఏర్పాటుకు సన్నాహాలు చేస్తామని మాటిచ్చారు. రానున్న రోజుల్లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు పై స్పష్టత ఇస్తామని, వైద్య సేవలు నిమిత్తం పోలీ క్లినిక్‌పై చర్చిస్తామని అన్నారు. ఆయనతో పాటు సికింద్రాబాద్ ఆర్మీ యూనిట్ అధికారులు కూడా వచ్చారు. ఈ సందర్భంగా పలాస మాజీ సైనిక సంక్షేమ సంఘం ఇచ్చిన గౌరవ వందనాన్ని కమాండర్ స్వీకరించారు. కార్యక్రమంలో పలాస మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఇళ్ల మన్మధరావు, సభ్యులు బంగారు బారికి, ఆర్మీ క్యాంటీన్ మేనేజర్, కార్యవర్గ సభ్యులు, సిబ్బంది మాజీ సైనికులు, మాజీ అధికారులు, వీర మహిళలు, వీర మాతృమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర సైబర్ నేరస్తుడు అరెస్టు

బరంపురం: జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అంతర్రాష్ట్ర సైబర్ నేరగాడిని బరంపురం పోలీసులు అరెస్టు చేశారు. బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 8న డెబిట్‌కార్డు లావాదేవీలో రూ.95 వేలు మోసపోయినట్లు బరంపురం సైబర్ పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఐఐసీ ప్రశాంత్ భూపతి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. జార్ఖండ్ రాష్ట్రం దేవగడా జిల్లా కారగ్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాగద్రీ గ్రామానికి చెందిన మహమద్ అఫ్జల్ ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. ఆదివారం అఫ్జల్‌ను అరెస్టు చేశారు. రెండు మొబైల్ ఫోన్లు, రూ.95 వేలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

16 వాహనాలు.. 24,981 ట్రిప్పులు



వైఎస్సార్ సంచార పశు వైద్యశాల అంబులెన్స్

- మూగజీవాలకు ప్రాణదానం చేస్తున్న అంబులెన్స్‌లు
- 38,882 మూగజీవాలకు ప్రాణం పోసిన సంచార పశువైద్య శాల అంబులెన్స్
- లబ్ధిపొందిన 32వేల పాడి రైతులు
- పశువుల పాలిట సంజీవనిగా 1962 టోల్ ఫ్రీ నంబర్



వైఎస్సార్ సంచాలర పశువైద్యశాల అంబులెన్స్ ద్వారా పశువులకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

కొత్తూరు: వైఎస్సార్ సంచార వైద్యశాల అంబులెన్సులు మూగజీవాల పాలిట సంజీవనిగా నిలుస్తున్నాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం మూగజీవాలకు వైద్య సేవలు అందించడానికి ఈ అంబులెన్స్‌లను వైఎస్సార్‌సీపీ సర్కారు ప్రవేశపెట్టింది. ఈ వాహనాలకు 1962 టోల్ ఫ్రీ నంబర్‌ను కేటాయించారు. పశువులకు అత్యవసర వైద్య సేవలు అందించడంతో పాటు ప్రమాదంలో చిక్కుకున్న మూగ జీవాలకు అంబులెన్స్ ద్వారా సామాజిక పశువైద్య శాలకు తీసుకు రావడంలో ఈ వాహనాలు కీలక సేవలు అందిస్తున్నాయి.

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు 16 వైఎస్సార్ సంచార వైద్యశాల వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. ఈ వాహనాల ద్వారా మూగ జీవాలకు అత్యవసర సేవలు అందించడంతో పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. ఇంటి వద్ద నిలబడలేని పశువులకు వైద్య సేవలు అందించేందుకు 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసిన వెంటనే సంచార పశువైద్య అంబులెన్స్ సకాలంలో చేరుకుంటోంది. అంబులెన్స్‌లోనే ఏర్పాటు చేసిన మినీ ప్రయోగ శాలలలో 15 రకాల రక్త పరీక్షలు సైతం నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల ఫలితాల ఆధారంగా వైద్యం అందజేస్తారు. ఈ వాహనంలోనే ఓ పశువుల వైద్యాధికారితోపాటు డిప్లమా పూర్తి చేసిన సహాయకుడు కూడా ఉంటారు. ఒక పైలెట్ కమ్ అటెండర్ వాహనంలో పనిచేస్తుంటారు. అంబులెన్స్‌లో 32 రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నారు. మెరుగైన వైద్యం అవసరం అనుకుంటే అదే వాహనంలో సమీపంలోని పశువుల ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు.

ఇతోధికంగా సేవలు..

కార్యక్రమం ప్రారంభం నుంచి ఈ అంబులెన్స్‌లు మొత్తం 24,981 ట్రిప్పులు తిరిగాయి. అలాగే 38,882 పశువులు, మేకలు, గొర్రెలు, గేదెలు వంటి పశువులకు వైద్య సేవలు అందజేశాయి. ఇప్పటివరకు మొత్తం 32వేల మంది రైతులు ఈ సంచార పశువైద్య శాల సేవలను వినియోగించుకున్నారు.

సకాలంలో వైద్యం అందుతోంది..



వైఎస్సార్ సంచార పశు వైద్య శాల అంబులెన్స్ ద్వారా ఆపదలో ఉన్న మూగజీవాలకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందుతోంది. అంబులెన్స్‌లో మినీ ప్రయోగశాల ఉన్నందున మూగజీవాలు వేగంగా ప్రమాదం నుంచి బయట పడుతున్నాయి. ఆపరేషన్ అవసరమైతే కోటబొమ్మాళి మండలం కురిడి పశువైద్య శాలకు పంపిస్తున్నాం.

– ఎం.కిశోర్, జేడీ, పశుసంవర్ధక శాఖ, శ్రీకాకుళం జిల్లా

అవగాహన కల్పిస్తున్నాం



వైఎస్సార్ సంచార పశువైద్య శాల వాహనాల వినియోగంపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. టోల్ ఫ్రీ నంబర్ 1962 పై పాడి రైతులకు చైతన్యం కల్పిస్తున్నాం. తీవ్రమైన ప్రాణాంతక వ్యాధికి గురైన, ప్రమాదంలో గాయపడిన మూగజీవాలకు పాడి రైతుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నాం. దీంతో మూగజీవాలు ప్రాణాలతో బయట పడుతున్నాయి.

– జి.నారాయణరావు, ఏడీ సామాజిక పశువైద్యశాల, కొత్తూరు

వైద్యంపై భరోసా



మనుషులకు 108 వాహనం మాదిరిగా పశువులకు 1962 టోల్ ఫ్రీ నంబర్‌తో వాహనం ఉపయోగపడుతోంది. దీంతో పశువైద్యంపై భరోసా వచ్చింది. పాడిరైతులకు ఈ వాహనాలతో ఎంతో ప్రయోజనం ఉంది.

– బూర్లె కృష్ణారావు, పాడి రైతు మెట్టూరు బిట్–1 (కృష్ణాపురం)

'రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటాలి'



రాకెట్‌ను అందజేస్తున్న సూర శ్రీను, కృష్ణంరాజు, కోచ్‌లతో జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటి విజేతలై జిల్లాకు తిరిగిరావాలని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీవీజీ కృష్ణంరాజు(తృప్తి రిస్టార్స్ మురళీ) క్రీడాకారులకు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకాకుళం బాల్ బ్యాడ్మింటన్ మైదానంలో ఆదివారం సబ్–జూనియర్ బాల, బాలికల శిక్షణ శిబిరాన్ని ఎచ్చెర్ల బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ అధ్యక్షుడు, సంఘ సేవకులు సూర శ్రీనివాసరావుతో కలిసి కృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడగా ఎంతో గుర్తింపు కలిగిన బాల్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న క్రీడాకారులందరూ నిరుపేద పిల్లలేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం క్రీడాకారులకు రైల్వే రాయితీలను నిలుపుదల చేయడంతో వారిపై మరింత ఆర్థిక భారం పడుతుందన్నారు. వీరిని ప్రోత్సహించడానికి శ్రీకాకుళం బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కోత పూర్ణచంద్రరావు, ఎస్ఈఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి ఎస్.ఈశ్వరరావు, ఎచ్చెర్ల బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ అధ్యక్షుడు సూర శ్రీనివాసరావు, కనకదుర్గ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్(టెక్కలి), పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు, ముందుకు వస్తుండటం శుభపరిణామమని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సూర శ్రీను జిల్లా జట్లకు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేసి తన దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు.

30 నుంచి నంద్యాలలో రాష్ట్రపోటీలు..

కర్నూలు జిల్లా నంద్యాల మహానంది దేవస్థానం మైదానంలో సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 2 వరకు ఏపీ రాష్ట్రస్థాయి సబ్–జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే శ్రీకాకుళం జిల్లా తుది జట్లను సంఘ బాధ్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి బీహెచ్ అరుణ కుమార్, కార్య నిర్వాహక కార్యదర్శి పి.అజయ్‌కుమార్, ఎల్.వి.రమణ, శిక్షకులు పి. రాజ్‌కుమార్, ఎం.మధుసూధనరావు, పి.పవన్‌కుమార్, చిరంజీవి, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే..

జిల్లా బాలుర జట్టు: శిష్టు హిమత్ కుమార్, నర్సీపురం ప్రవీణ్ కుమార్, లబ్బ మణికంఠ, గొంటి నవీన్ కుమార్, గూడిపుడి చాయాకిరణ్, వాకమారి యోగి, వెంపాడ సురేష్ రెడ్డి, పొన్నాడ జితేంద్ర, ఎర్ర మదన్, పట్టిసపు నిష్యాంత్.

జిల్లా బాలికల జట్టు: ముంత గాయత్రి, సింగూరు నందిని, బెందు జోత్స్న, సంబంగి వినూత్న, శిష్టు ప్రియమణి, రామ భువనేశ్వరి, ఉంగటి పావని, చల్లా శ్రావణి, పోరాం భువనకృతి ఎంపికైనవారిలో ఉన్నారు.

ఆసక్తిగా రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు



చదరంగం ఆడుతున్న పాఠశాలల విద్యార్థులు



వివిధ కేటగిరీల్లు గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎస్.ఈశ్వరరావు

రణస్థలం: మండలంలోని ఎస్ఈఆర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కూల్‌లో ఆదివారం రాష్ట్ర స్థాయి పాఠశాలల ర్యాంకింగ్ చదరంగం పోటీలు ఆసక్తిగా సాగాయి. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఆత్మస్థైర్యం పెరుగుతుందని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీవీ శర్మ, ఎస్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎస్.ఈశ్వరరావులు తెలిపారు. రాష్ట్రంలోని 60 స్కూల్స్ నుంచి 200 మంది క్రీడాకారులు తరలివచ్చారు. ఇందులో ఇంటర్నేషనల్ రేటెడ్, స్టేట్ లెవెల్, వర్ధమాన క్రీడాకారులు ఉన్నారు. ఐదు రౌండ్ల పాటు సాగిన ఈ పోటీల్లో వివిధ జిల్లాల క్రీడాకారులు నువ్వా–నేనా అన్నట్లు హోరాహోరీగా తలపడ్డారు. వివిధ కేటగిరీల్లో ఎంపికైన క్రీడాకారులు జాతీయ స్థాయి పాఠశాలల చదరంగం పోటీలకు ఎంపికయ్యారు. అలాగే ప్రతి కేటగిరీ నుంచి పదిమంది చొప్పున 60 మంది క్రీడాకారులు ర్యాంకింగ్ పొందారు. అండర్–12 కేటగిరీలో శ్రీకాకుళం పాఠశాలకు తోట భాన్విక ద్వితీయ స్థానం రాగా, ఎస్ఈఆర్ స్కూల్ నుంచి మూడో స్థానంలో లక్ష్మీ ప్రణవి అండర్–10 కేటగిరిలో ఎంపికైంది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ తేజ, రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి సనపల భీమారావు, కోశాధికారి జ్యోలాముఖి, జిల్లా అధ్యక్షులు బగాది కిషోర్, కార్యదర్శి ఉదయ్ కుమార్, సీనియర్ నేషనల్ అర్బిటర్ చలపతిరావు, సీనియర్ కోచ్ అభినవ్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు



ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అధికారులకు పిలుపునిచ్చారు. ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం డీఆర్‌ఓ అధ్యక్షతన ఆదివారం ఆయన చాంబర్‌లో జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి అక్టోబర్ 6 వరకు 11 రకాలు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇందులో జిల్లా ప్రొబేషన్ అధికారి, టెక్నికల్ అసిస్టెంట్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్, జూనియర్ ట్రాన్స్‌లేటర్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, నాన్ గెజిటెడ్, గ్రూప్ 4 వంటి పరీక్షలున్నట్లు తెలిపారు. ఇవి పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ పరీక్షలని, ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర, శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షిఫ్ట్‌లలో పరీక్షలు జరుగుతాయని అన్నారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి గంట ముందే హాజరుకావాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అలసత్వం, అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్, తాగునీరు, విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అభ్యర్థుల కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని, కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. అధికారులకు అప్పగించిన విధులను సమన్వయంతో సక్రమంగా నిర్వహించి, పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని ఆయన కోరారు.

సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ బీసీహెచ్ కుమార్ రాజు, సెక్షన్ ఆఫీసర్ డి.ప్రశాంత్ కుమార్, అడిషనల్ ఎస్పీ జె.తిప్పేస్వామి, ఎచ్చెర్ల తహసీల్దార్ సత్యనారాయణ, హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు శ్రీకాంత్, ఉప తహసీల్దార్లు ఆర్. శ్రీనివాసరావు, త్రినాథ రావు, శ్రీవెంకటేశ్వర, శివానీ ఇంజినీరింగ్ కళాశాలలు, వివిధ శాఖల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ తమ్మినేని, మంత్రి ధర్మానలతో..




స్పీకర్ తమ్మినేని సీతారాంను దుశ్శాలువతో సత్కరిస్తున్న డీపీ దేవ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్ర శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన డీపీ దేవ్ స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి మంత్రి ధర్మాన ప్రసాదరావులను మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో మంత్రి, స్పీకర్‌ల నివాసాల్లో ఆదివారం వారిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి ధర్మాన ప్రసాదరావుకి పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

నలభై మూడేళ్లకు కలిశారు..



పలాస జూనియర్ కాలేజీలో 1968–78 మధ్య కాలంలో చదువుకున్న వారు ఆదివారం స్థానిక మినీ వేదిక ఫంక్షన్ హాల్‌లో మళ్లీ కలిసి ఆ నాటి రోజుల్ని జ్ఞాపకం చేసుకున్నారు. వారు అప్పట్లో చదువుకున్న పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి వారి తరగతి గదులను పరిశీలించి అప్పటి కళాశాల పరిస్థితి ఇప్పటి కళాశాలకు మార్పును గుర్తించి సంతోషపడ్డారు.

– కాశీబుగ్గ

ఉత్కళాంధ్ర కబడ్డీ విజేత సింగుపురం



కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఇచ్ఛాపురం రూరల్: తిప్పనపుట్టుగలో సిద్ధి వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్కళాంధ్ర స్థాయి కబడ్డీ పోటీల్లో సింగుపురం జట్టు విజేతగా నిలిచింది. మొత్తం 25 జట్లు పోటీలో పాల్గొనగా, సింగుపురం జట్టు విజేతగా, కోడి రామ్మూర్తి స్టేడియం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. తృతీయ, చతుర్థ స్థానాల్లో ఒడిశాకు చెందిన బెర్హంపూర్, బురడ జట్లు నిలిచాయి. విజేతలకు గ్రామ పెద్దలు తిప్పన దాలయ్యరెడ్డి, రత్నాల తారకేశ్వరరావు, మజ్జి దేవ్, మోహన్‌సాహూలు నగదుతో పాటు షీల్డు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

పేదలకు ఆరోగ్య శ్రీ అండ

- జిల్లాలో 7,90,923 ఆరోగ్య శ్రీ కార్డులు
- 90 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు
- నాలుగున్నరేళ్లలో 1,64,321 మందికి లబ్ధి



బుడితి సీహెచ్‌సీలో ఆరోగ్య శ్రీ క్యాబిన్

సారవకోట: పేదవాడు కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లడానికి భయపడే రోజులు పోయాయి. జేబులో ఆరోగ్య శ్రీ కార్డు ఉంటే చాలు ఎంత పెద్ద ఆస్పత్రికైనా వెళ్లి చికిత్స చేయించుకోవచ్చుననే ధైర్యాన్ని వైఎస్సార్ సీపీ సర్కారు సామాన్యులకు ఇచ్చింది. గత నాలుగున్నరేళ్లలో ఈ పథకం కింద చికిత్స పొందే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. జిల్లాలో మొత్తం 7,90,923 ఆరోగ్య శ్రీ కార్డులున్నాయి. ఈ పథకం కింద 3,255 రకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. జిల్లాలో 90 ప్రభుత్వ, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈ పథకం అమలవుతోంది. పథకాన్ని అమలు చేసేందుకుగాను జిల్లా స్థాయిలో జిల్లా మేనేజర్ నుంచి గ్రామస్థాయిలో ఆరోగ్య మిత్రలు సేవలందిస్తున్నారు. గత నాలుగేళ్ల కాలంలో 1,64,321 మందికి లబ్ధి చేకూరగా దీని కోసం ప్రభుత్వం రూ.402 కోట్లు ప్రయోజనం చేకూరింది.

ఆసరాతో మరింత ఊరట

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం కింద చికిత్స పొంది డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లిన వారు కొంత కాలం పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ సమయంలో వారికి పని దినాలు పోవడంతో పాటు ఆర్థికంగా ఇబ్బంది అవుతుంది. ఇలాంటి ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మనసుతో మరింత ఊరట కల్పిస్తోంది. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సమయంలోనూ ఆసరా పథకంతో ఆదుకుంటోంది. రోజుకు రూ.275కు తగ్గకుండా నెలకు రూ.5 వేలకు మించకుండా సహాయాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తోంది. ఆయా వ్యాధులు, అందించిన చికిత్సను బట్టి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఈ మొత్తాన్ని లబ్ధిదారునికి అందిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటి వరకు జిల్లాలో 89,251 మంది లబ్ధిపొందగా వారి బ్యాంకు ఖాతాలో రూ 52.04 కోట్లు జమ అయ్యాయి.

ఆరోగ్య శ్రీ చికిత్సల వివరాలు

సంవత్సరం	మొత్తం చికిత్సలు	క్లెయిమ్ (రూ.కోట్లు)
2019	20,33,312	84.4
2020	21,30,932	78.91
2021	22,39,360	97.89
2022	23,45,151	106.45
2023(ఇప్పటివరకు)	24,15,566	34.56

పేదలకు వరం

పేద ప్రజలకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం వరంగా పనిచేస్తోంది. ప్రతి నెలా కొన్ని వందల మందికి ఆరోగ్య శ్రీ ద్వారా ప్రాణదానం జరుగుతోంది. ఈ పథకం లేకపోతే ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం కోసం అయ్యే ఖర్చు భరించలేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయేవారు. ఆరోగ్య శ్రీలో చికిత్స పొందే రోగులు ఏ ఆస్పత్రిలోనూ ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన పనిలేదు.

– డాక్టర్ పొగిరి ప్రకాశరావు, ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్, శ్రీకాకుళం